@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 28, డిసెంబర్ 2024 || పేజీలు: 04






## ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రజాసేవలను ఓర్వలేక

## అత్త ఝాన్సీరెడ్డిపై ప్రతిపక్షాల

# అసత్య ఆరోపణలు

### ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేకే.. ఝాన్సీరెడ్డిపై పసలేని ప్రచారాలు

- ఉడుకు నీళ్లకు ఇండ్లు కాలవు... పుండకోరు మాటలు ఎంతకాలం నిల్వవు
- సర్వే చేయించింది అనడం తప్పుడు ఆరోపణ
- షాడో ఎమ్మెల్యే అనడం చేతకాని వాళ్ల పుండకోరు మాటలు
- పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జిగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ..
- కార్యకర్తలకు వెన్నుదన్నుగా.. ఓ భరోసానిస్తున్నారు
- నిజాయితీగా ఉంటే.. నియంత ఎలా అవుతుంది? ఓర్వలేనోళ్ల 'కారు' కూతలు..
- తప్పుడు ప్రచారాలు చేస్తూ తమాషా చేసేటోళ్లకు.. త్వరలో ప్రజలే తగిన బుద్ధి చేప్పుతారు
- గాయాన్ని సైతం లెక్కచేయకుండా
- కర్రల సహాయంతో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని తిరుస్తున్నారు
- ఆచారణకు సాధ్యమైన హామీలను ఇచ్చారు.. దశల వారిగా అమలు చేస్తున్నారు
- నేటి ఫోకస్ న్యూస్‌తో పాలకుర్తి ప్రజలు..



పాలకుర్తి, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:

**పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో** ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సారధ్యంలో చేసే మంచి పనులు చూసి ఓర్వలేక.. అత్త ఝాన్సీరెడ్డి పై పనికట్టుకొని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పాలకుర్తి ప్రజలు అంటున్నారు. ఎమ్మెల్యేకి తోడుగా పార్టీ ఇన్చార్జిగా ఎల్లవేళల వారి కష్టా సుఖాలలో పాలు పంచుకుంటు నిత్యం తిరిగే హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి ప్రజల్లో పెరుతుగున్న ఆదరణను చూసి కండ్లు మండి ఓర్వలేక ప్రతిపక్షా నాయకులు చేసే తప్పుడు ప్రచారాలను నియోజకవర్గ ప్రజలు నమ్మం అంటున్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు ఎక్కడకు వెళ్లిన తమ తోబుట్టువులా, ప్రజలు ఆదరిస్తు వారి సమస్యలను వివరిస్తు పరిష్కరించు కుంటున్నారు. హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఏ గ్రామానికి వెళ్లినా, ఏ తండాకు వెళ్లినా...ఆప్యాయతగా ఆహ్వానిస్తున్నారే తప్పా... ఆగ్రహం వ్యక్తం చేసిన దాఖలు ఎక్కడ లేవు. ప్రతిపక్షనాయకులు, మాజీల కారు కూతలు కూస్తున్నారని, లేనిపోని నిందులు కాజేస్తు, తప్పుడు ఆరోపణలు చేయడం మిగతా 2లో..



## నిజమైన రాజనీతిజ్ఞుడు

# మన్మోహన్

- దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారు
- మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాం
- సీడబ్ల్యూసీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాప తీర్మానం చేసింది. మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. ఆయన నిజమైన మిగతా 2లో..



## కేటీఆర్ మధ్యంతర బెయిల్

# పొడిగింపు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:

ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశం మేరకు ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్‌ను అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ కోరింది. కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దన్న మిగతా 2లో..

## ప్రముఖుల నివాళి

- ఇంటికి వెళ్లి నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము
- ప్రధాని మోడీ, అమిత్ షా తదితరుల శ్రద్ధాంజలి
- కేబినేట్ భేటీలో ఘనంగా నివాళి
- వారంపాటు దేశంలో సంతాపదినాలు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రధాన కార్యాలయాలపై జాతీయజెండా అవనతం

వివరాలు 02లో..





## మన్మోహన్‌కు సిఎం రేవంత్

# నివాళి

- పార్థివదేహం వద్ద మంత్రులతో కలసి శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:

మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ ఎంపీలు ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్ వద్ద ఉన్న మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్నారు. పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం భారతదేశ ప్రజలకు తీర్చలేనటువంటి లోటన్నారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధానిమంత్రిగా ఉన్నప్పుడు మొట్ట మొదటిసారిగా మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక శాఖ మిగతా 2లో..



## ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసు..

# 31 వరకు అరెస్ట్ చేయొద్దు

- హైకోర్టులో విచారణ..31కి వాయిదా 2

నేటి ఫోకస్ న్యూస్

శనివారం 28, డిసెంబర్ 2024

# యశస్వినిరెడ్డి ప్రజాసేవలను ఓర్వలేకే..

## అత్త ఝాన్సీరెడ్డిపై ప్రతిపక్షాల అసత్య ఆరోపణలు











(మొదటి పేజీ తరువాయి..)

సరికాదని, ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు.

### సర్వే చేయించింది అనడం తప్పుడు ఆరోపణ: కాంగ్రెస్ నాయకులు

తాను ఎమ్మెల్యే కావడానికి సర్వే చేయించుకుందని వస్తున్న ఆరోపణను ఝాన్సీరెడ్డి కొట్టిపారేశారు.తానేందుకు సర్వే చేయంచుకుంటనని? ప్రజలకు తనపై ఉన్న నమ్మకమే గొప్ప సర్వే ఇక అంతకన్న సర్వే దేనికీ? తన ఇమేజ్‌ని దెబ్బ తీయడానికే ప్రతిపక్ష నాయకులు,మాజీ మంత్రిలు వెనుక ఉండి ఉత్తిత్తి పుకార్లు చేయిస్తు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. తండాలలోగాని, గ్రామాలలో గాని పార్టీ నాయకులపై ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉందనే దానిపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి వేసే అడుగును గమనిస్తూ ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నం ప్రతి పక్షాలు చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

ప్రతిపక్షాలు ఎన్ని మాయమాటలు చెప్పి, ఝాన్సీరెడ్డిని అబాసు పాలు చేసే కుట్రలు పన్నిన తాము నమ్మమని నియోజకవర్గంలోని ప్రజలు ముక్తకంఠంతో తెలియజేస్తున్నారు.

### షాడో ఎమ్మెల్యే అనడం చేతకాని వాళ్ల పుండకోరు మాటలు: కాంగ్రెస్ కార్యకర్తలు

పాలకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా జరిగే అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ కార్యక్రమాలలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొంటున్నారు, పార్టీ ఇన్చార్జిగా ఝాన్సీరెడ్డి పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.. అంతేగాని తన పరిధికి మించి ఏనాడు ప్రవర్తించలేదని నియోజకర్గ నాయకులు, కార్యకర్తలు తెలియజేస్తున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభివృద్ధిని చూసి ఓర్వలేక, వచ్చే స్టానిక సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అబాసు పాలు చేసేందుకే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రజలు అంటున్నారు.

### పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు వెన్నుదన్నుగా...ఓ భరోసాగా.. ఝాన్సీ రెడ్డి

ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానంటూ వారి వద్దకు ఝాన్సీ రెడ్డి వెళు న్నారు. కార్యకర్తలుగాని, నాయకులుగాని, ప్రజలుగాని ఎవరు వచ్చినా పార్టీలకు అతీతంగా వారి కష్టాలను తెలుసుకొని తాను స్వయంగా ఆ పనిని చేయడమో..లేదా ఎవరిన్కైన పంపించి ఆ సమస్యను పరిష్కరించడమో చేస్తున్నారు.

అంతేందుకు ఇటీవల ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు తన కాలికి దెబ్బతగిలి గాయమైన కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో కూడా తన ఇంటికి వచ్చి ప్రజలు సమస్యలు చెప్పుకోవడం జరిగేది, ప్రజల సౌకర్యార్థం వారికి ఇబ్బందులు కలుగవద్దని తానే స్వయంగా వాకర్, ఇతర కర్రల సహాయంతో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారు. ఆమె చేస్తున్న ప్రజాసేవ, ప్రజారంజక కార్యక్రమాల వల్ల స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టే అవకాశాలు ఉన్నాయని గమనించిన ప్రతిపక్ష నాయకులు ఇలా తప్పుడు పుకార్లు పుట్టిస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు.

### నిజాయితీగా మాట్లాడితే నియంత ఎలా అవుతుంది?..ఓర్వలేనోళ్లు చేసే 'కారు' కూతలు..

ప్రజాసేవే లక్ష్యంగా ఝాన్సీరెడ్డి ప్రజలను ముఖాముఖీ కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకునే నేపథ్యంలో కొందరిని పద్ధతిగా ఉండాలని మందలించడం వల్ల వారి మనసు నొచ్చుకోవచ్చు.కానీ ఇతర రాజకీయ నాయకుల మాదిరిగా మభ్యపెడుతూ అప్పుడు,..ఇప్పుడు అంటూ వారిని తిప్పు కోవడం ఇష్టం లేక వారికి ఏది అవసరమో తెలుసుకొని తను వ్యక్తి గతంగా చేయడం, ఇతర అవసరాలు ప్రభుత్వ పరంగా ఎంత మేరకు అయితాదో అంతే చేసి, కాని పనిని కాదని నిర్మోహమాటంగా చెప్పడం వల్ల కొందరు నొచ్చుకోవచ్చు. అంతమాత్రాన తాను నియంతగా వ్యవహరించినట్లు ఎలా అవుతాది?...గిట్టని వాళ్లు చేసే ఈ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

### పదవులు అమ్ముకుంటునట్లు నిరూపిస్తే దేనికైన సిద్దం: ఝాన్సీరెడ్డి

స్థానికంగా ఉన్న నామినేటేడ్ పదవులకు కాంగ్రెస్ పార్టీలో సీనియర్లను, పార్టీకి వాళ్లు చేసిన సేవలను గుర్తి, సామాజికంగా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ... పదవులు ఇవ్వడం జరిగిందని అందులో ఏ పదవిన్కైన అమ్ముకున్నట్లు రుజువు చేస్తే తాను దేనికైన సిద్ధమంటూ ఝాన్సీ రెడ్డి సవాల్ విసిరారు . ఉట్టిగనే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చేసే పుకార్లను, గాలిమాటలను నమ్మవద్దని ఆమె పార్టీ నాయకులను,కార్యకర్తలను, ప్రజలను కోరారు.భవిష్యత్తులో కూడ అన్ని వర్గాలకు తగన ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీ ఎదుగుదలను,నియోజకవర్గ అభివృద్దిని చూసి కండ్లు కుట్టే ప్రతిపక్ష నేతలకు కనువిప్పు కలుగుటకు వచ్చే స్థానిక సర్పంచ్‌ల ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెపుతారని ఝాన్సీరెడ్డి అన్నారు.

# మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి







**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:** భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తదితర ప్రముఖులు నివాళు లర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో దేశ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా' అని మోదీ తెలిపారు. అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ అత్యవసరంగా సమావేశమై ఘనంగా నివాళి అర్పించింది. వారంపాటు సంతాపదినాలు ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. అటు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంపైనా జాతీయజెండాను సగానికి దించారు. కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చే ఏడు రోజుల పాటు కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంది.

92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గత రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. శనివారం రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

### సోనియా, రాహుల్ నివాళి ఖర్గే శ్రద్ధాంజలి

**- నేడు ఏఐసిసి కార్యాలయానికి పార్థివదేహం**

**న్యూఢిల్లీ:** భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) పార్థివ దేహానికి కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా అపారమైన జ్ఞానం, సమగ్రతతో భారతదేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. ఆయనలోని వినయం, ఆర్థికశాస్త్రంపై ఆయనకున్న లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తినిచ్చాయి. నా జీవితంలో ఎంతో ముఖ్యమైన ఓ గురువును కోల్పోయాను' అని అన్నారు. ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రా సైతం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ.. మన్మోహన్ ఎల్లప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేసేవారని పేర్కొన్నారు. ఆర్థిక విషయాలపై ఆయనకు చాలా జ్ఞానం ఉందని అన్నారు. మన్మోహన్ సింగ్ యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంతో మన్మోహన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. గురువారం రాత్రి ఆయన మరణవార్త తెలియడంతో కర్ణాటకలోని బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాలను అర్ధంతరంగా ముగించి.. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వెంటనే దిల్లీకి బయలుదేరారు. దిల్లీలోనే ఉన్న సోనియా, ప్రియాంక ఆసుపత్రి వద్దకు చేరుకున్నా రు.శనివారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మన్మోహన్ పార్థివ దేహాన్ని ఆయన నివాసంలో ఉంచారు. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

### మన్మోహన్‌కు సిఎం రేవంత్ నివాళి

(మొదటి పేజీ తరువాయి..)

మంత్రి నియమించారని గుర్తు చేశారు. 15 టన్నుల బంగారాన్ని కుదవపెట్టి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారన్నారు. భారతదేశ ఆర్థిక పరిస్థితి కుదేలైన సమయంలో ప్రధానిగా పీవీ నరసింహారావు, ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ వచ్చారని వెల్లడించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గల ముఖ్య కారకుడు మన్మోహన్ సింగ్ అని మల్లు రవి కొనియాడారు. ఆ ఐదు సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులను బయటపడి ప్రగతి పథంలో ముందుకు వెళ్ళిందన్నారు. మన్మోహన్ సింగ్ అంటేనే సంస్కరణలకు పెట్టింది పేరని.. దేశం ఒక మహా నేతను కోల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన సంస్కరణల అడుగుజాడల్లోనే తదుపరి వచ్చిన ప్రధాన మంత్రులు నడుచుకున్నారని స్పష్టం చేశారు. ఆయనను గొప్ప ప్రధానిగా గుర్తించి సేవలను అందరూ తలచుకుంటున్నారన్నారు.

## కేటీఆర్ మధ్యంతర బెయిల్ పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి..)

ఉత్తర్వులను ఈ నెల 31వ తేదీ వరకు కోర్టు పొడిగించింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని వారం రోజుల క్రితం హైకోర్టు ఏసీబీని ఆదేశించిన సంగతి తెలిసిందే.

## ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసు 31వరకు అరెస్ట్ చేయొద్దు

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:** ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. కేటీఆర్‌ను ఈనెల 31 వరకు అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. విచారణను డిసెంబర్ 31కి వాయిదా వేసింది. కాగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి ఇప్పటికే హైకోర్టు డిసెంబర్ 30 వరకు కేటీఆర్‌కు నాట్ టు అరెస్ట్ ఇచ్చిన విషయం తెలిసిందే. కేటీఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, అరెస్ట్ చేయవద్దని గత విచారణలో హైకోర్టు ఆదేశించింది. శుక్రవారం ఫార్ములా ఈరేస్ కేసు హైకోర్టులో విచారణకు రాగా.. ఏసీబీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఏసీబీ మరో పిటిషన్ కూడా దాఖలు చేసింది. కేటీఆర్ నాట్ టు అరెస్ట్ ఆదేశాలను ఎత్తివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 31 వరకు వాయిదా వేసింది. ఇప్పటి వరకు 30 వరకు ఉన్న నాట్ టు అరెస్ట్‌ను.. మరొక్క రోజుకు హైకోర్టు ధర్మాసనం పొడిగించింది. ఈనెల 31న నాట్ టు అరెస్ట్ పిటిషన్‌పైన అలాగే ఫార్ములా ఈ రేసింగ్‌కు సంబంధించి నమోదైన కౌంటర్‌పై కూడా హైకోర్టు పూర్తి స్థాయిలో విచారణ జరపనుంది. ఇప్పటి వరకు ఫార్ములా ఈరేస్ వ్యవహారానికి సంబంధించి సుదీర్ఘంగా వాదనలు వినిపించిన తర్వాత కేటీఆర్‌కు హైకోర్టు స్వల్ప ఊరటనిచ్చింది. అయితే దాన్ని కూడా ఎత్తివేయాలని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఏసీబీ పిటిషన్‌లో పేర్కొంది. ఈ సమయంలో కేటీఆర్‌కు బెయిల్ మంజూరు చేసినా, రిలీఫ్ ఇచ్చినా, నాట్ టు అరెస్ట్ ఇచ్చినా విచారణకు ఇబ్బందికర వాతావరణం ఉంటుందని ఏసీబీ వెల్లడించింది. నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని ఏసీబీ మరో పిటిషన్‌ను వేసింది. ఆ పిటిషన్‌కు సంబంధించి ప్రతివాదిగా కేటీఆర్‌ను చేర్చారు. దీంతో కేటీఆర్ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న ఫార్ములా ఈ కార్ రేస్‌పై ప్రభుత్వం వేసిన పిటిషన్‌పైన వాదనలు కొనసాగుతాయి. అలాగే నాట్ టు అరెస్ట్‌పై కేటీఆర్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు జరుగనున్నాయి. ఈ రెండు అంశాలపై డిసెంబర్ 31న ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

(మొదటి పేజీ తరువాయి..)

రాజనీతిజ్ఞుడని, దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారని గుర్తు చేసుకున్నారు.ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యులు సమావేశమై సంతాప తీర్మానం చేశారు. శనివారం జరిగే మన్మోహన్ సింగ్ అంతిమసంస్కారాల నిర్వహణపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక, తదితర నేతలంతా పాల్గొన్నారు. భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగంలో మన్మోహన్ ఒక మహోన్నత వ్యక్తి అని, ఆయన చేసిన కృషి దేశాన్ని మార్చివేసిందని తెలిపింది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని గుర్తుచేసుకున్నారు. 1990 ప్రారంభంలో ఆర్థిక మంత్రిగా భారతదేశ ఆర్థిక సరళీకర ణకు రూపశిల్పి అని కొనియాడారు. అసమానమైన దూరదృష్టితో వరుస సంస్కరణలను ప్రారంభించారన్నారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించడమే కాకుండా ప్రపంచ మార్కెట్లకు కూడా తలుపులు తెరిచాయని స్మరణచేసుకున్నారు. నియంత్రణ సడలింపు, ప్రైవేటీకరణ మరియు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహం వంటి విధానాల ద్వారా భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి పునాది వేశారని నేతలు నెమరువేసుకున్నారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉద్భవించిందని కొనియాడారు. ఇది ఆయన ప్రతిభ, దార్శనికతకు నిదర్శనం అని సీడబ్ల్యూసీ పేర్కొంది. నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని పేర్కొంది.

## మద్యం మత్తులో బైక్ ప్రమాదం

**- ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మృతి**

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందా రు. ఈ ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. బోరబండకు చెందిన ఆకాన్ష్, రఘుబాబు అర్ధరాత్రి సమ యంలో బోరబండ నుంచి మాదాపూర్ వెళ్తుండగా.. మాదాపూర్ 100 ఫీట్ రోడ్‌లోని పర్వత్ నగర్ చౌరస్తా సమీపంలో బుల్లెట్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలిలో నే ఒకరు మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందినట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు. బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## న్యూ ఇయర్ గిఫ్ట్‌ల పేరుతో మోసం

**- సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**- హెచ్చరించిన ఆర్టీసీ ఎండి సజ్జన్నార్**

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 27:** కొద్దిరోజుల్లో కొత్త సంవత్సరంలో అడుగుపెట్టబోతున్నాము. అయితే కొత్త సంవత్సర వేడుకలపై సైబర్ కేటుగాళ్లు ఫోకస్ పెట్టారు. న్యూయర్ విషెస్ అంటూ అమాయకులను దోచుకునే ప్లాన్‌లో ఉన్నారు. దీనిపై ముందుగానే అలర్ట్ అయిన సైబర్ క్రైం అధికారులు ప్రజలకు తగు సూచనలు జారీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రజలకు సీనియర్ ఐపీఎస్, టీజీ ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో ఉన్నదంతా దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఎ÷-లాన్ వేశారని, అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే అన్నారు.

# ప్రపంచ వికలాంగ దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ డిసెంబర్ 27

ప్రపంచ వికలాంగ దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడవత్ రవి తెలిపారు శుక్రవారం అచ్చంపేట డివిజన్ కేంద్రంలోని వికలాంగుల కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు అచ్చంపేట డివిజన్ కేంద్రంలోని పటేల్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర స్థాయి ప్రపంచ వికలాంగుల దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో వికలాంగులకు క్యాంపు పరికరాలు క్యాంప్ నిర్వహించి అవసరమైన దరఖాస్ చేసుకోగలరు వారికి ఉపక పరికరాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు మరియు ఈ కార్యక్రమంలో ఆర్డిటి డైరెక్టర్, ఎటిఎల్ రామ్మోహన్ ఆధ్వర్యంలో కళాకారుల చేత సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించడం కూడా జరుగు తుందని అన్నారు రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ముగింపు వేడుకలు మన జిల్లాలో నిర్వహిస్తున్నందుకు గర్వించదగ్గ విషయమని అన్నారు రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు హాజరవుతున్నందువలన నాగర్ కర్నూల్ జిల్లాలోని వికలాంగులు అందరూ కూడా పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు అంగోత్ శంకర్. జిల్లా కోశాధికారి గట్టు రఘునందన్ రెడ్డి. అచ్చంపేట టౌన్ అధ్యక్షులు గణేష్ కుమార్ . బల్మూర్ గౌర అధ్యక్షులు విజయ్ కుమార్, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు



# మృతుడు కడెం హరీష్ పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి





తొర్రూర్(నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 27

మండల పరిధిలోని అమ్మాపురం గ్రామానికి చెందిన కడెం రాజాలు కుమారుడు కడెం హరీష్ ప్రమాదవశాత్తు అమ్మపురంలోని గ్రానైట్ క్వారీలో పడి చనిపోగా ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతుని భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు క్వారీ యజమాన్యంతో ఫోన్లో మాట్లాడి మృతుని కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా ఈ ఘటనపై ప్రభుత్వం కూడా స్పందించి వారిని ఆదుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మాజీ ఎంపీపీ టిసి అంజయ్య, అమ్మపురం గ్రామ మాజీ సర్పంచ్ కడెం యాకయ్య, తొర్రూరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, గ్రామస్తులు బేడ బుడగ జంగం కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## కేంద్రంతో కొట్లాడైనా పాలమూరు ప్రజలకు న్యాయం చేయాలి..




### రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్ నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్27

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఇప్పట్లో నీళ్లు వచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. పంపులు రెడీగా ఉన్నా రిజర్వాయర్లు నింపడం లేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి అనుమతులు తెచ్చే ప్రయత్నం కూడా చేయడం లేదని విమర్శించారు. అక్రమ కేసులు, అరెస్టులు, డైవర్షన్ పాలిటిక్స్‌పైనే ప్రభుత్వం శ్రద్ధ పెట్టిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. అభివృద్ధిపై మాత్రం ఈ ప్రభుత్వం దృష్టిపెట్టడం లేదని అన్నారు. కాల్వలు ఉన్నా.. మోటార్లు సిద్ధంగా ఉన్నా పంపులను మాత్రం ఆన్ చేయ డం లేదని తెలిపారు. కావాలనే పాలమూరు ప్రాజెక్టును ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మండిపడ్డారు. కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన అనుమతులను ఏపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే పాలమూరు సస్యశ్యామలం అవుతుందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి అనుమతులు నిలిపివేయడం చాలా బాధాకరమని తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్లో ఫిర్యాదు చేసి ప్రాజెక్టును అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. కేంద్రంతో కొట్లాడి పాలమూరు ప్రజలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై టీటీడీ కీలక నిర్ణయం..

### ఇక వారానికి రెండు సార్లు అనుమతి!

హైదరాబాద్ నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్27

తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనాల కోసం వారానికి రెండు సార్లు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలను అనుమతించాలని నిర్ణయించింది. తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడంపై కొద్దిరోజులుగా చర్చ జరుగుతోంది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అను మతించకపోవడాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఖండించారు. తిరుమలలో తెలంగాణ మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల అంశాన్ని టీటీడీ పునఃపరిశీలించింది. సాటి తెలుగు రాష్ట్రంపై ఇలాంటి నిర్ణయం సరికాదని భావించింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీ బోర్డులోని మెజారిటీ సభ్యులు కూడా కోరారు. దీంతో వారానికి రెండుసార్లు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది.

## ఎట్టకేలకు టీజీ టెట్ -2024 హాల్ టికెట్లు విడుదల..

### కానీ ఆ మూడు సెషన్లకు

హైదరాబాద్ నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్27

టీజీ టెట్ -2024 హాల్ టికెట్లు ఎట్టకేలకు విడుదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం గురువారమే హాల్ టికెట్స్ విడుదల చేయాల్సి ఉండగా.. కానీ విడుదల చేయలేదు. మొత్తానికి శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత టీజీ టెట్ హాల్ టికెట్లను విడుదల చేశారు. జనవరి 2 నుంచి 20వ తేదీ దాకా టెట్ పరీక్షలను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అయితే జనవరి 11వ తేదీన నిర్వహించే మార్నింగ్ సెషన్, జనవరి 20న నిర్వహించే ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు సంబంధించిన హాల్ టికెట్లను విడుదల చేయలేదని అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఆ మూడు సెషన్ల హాల్ టికెట్లను విడుదల చేయలేకపోతున్నామని, ఈ సెషన్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో డిసెంబర్ 28 నుంచి అందుబాటులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. టెట్ హాల్ టికెట్ల కోసం https:// tgtet 2024.aptonline.in/tgtet/ అనే వెబ్‌సైట్‌ను సంప్ర దించొచ్చు. టెట్ హాల్ టికెట్ డౌన్ లోడ్ కోసం జర్నల్ నంబర్, పుట్టిన తేదీ తప్పనిసరి.

# టోకెన్ సమ్మెతో ఉద్యమం తీవ్రతరం చేస్తాం..




తొర్రూర్(నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 27

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మెతో ఉద్యమం తీవ్ర తరం చేసాం అని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసిఐ అనుబంధం హెస్-106)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. నేడు తొర్రూరులోని అమరవీరుల స్తూపం వద్ద నేడు గ్రామ పంచాయతీ కార్మికుల తో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదని అన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ తమ జీవితాలను క్రొవ్వత్తి లా కరిగిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పట్ల నిమ్మకు నీరెట్టినట్టు రాష్ట్ర ప్రభుత్వతీరు ఉన్నదన్నారు. గత పది నెలలుగా వేతనాలు అందక అప్పులు తెచ్చుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న గ్రామపంచాయతీ కార్మికులు ఉద్యోగం వదిలి పట్టణాలకు వలస పోతున్నారని అన్నారు. జీతాలు అందక, జాబ్స్ పర్మినెంట్ కాక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల దౌర్భాగ్యకరమైన పరిస్థితి తెలంగాణలో నెలకొందని అన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇస్తూ పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని లేదంటే నిరవధిక సమ్మె తప్పదన్నారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడియా బీకు మండల అధ్యక్షులు సోమనర్సయ్య మండల నాయకులు యాకయ్య,రాము వెంకట్, యాకయ్య, నరసయ్య మహేష్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## అల్లు అర్జున్ ఏ11 అయినప్పుడు.. రేవంత్ రెడ్డి కూడా ఏ11 అవ్వాలి కదా: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్27

మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలు తీస్తుండగా షాక్ కొట్టి ఇద్దరు యువకులు మరణించిన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట, మెదక్ ప్రమాదం.. ఈ రెండు సంఘటనల్లోనూ వేర్వేరు న్యాయాలు ఉండరాదని అన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో ఏ11 అయినప్పుడు.. రేవంత్ రెడ్డి కూడా ఏ 11 కావాలి కదా అని రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను ప్రశ్నించారు. ఈ రెండు ఘటనల్లో ఇద్దరు ప్రముఖులే అని.. ఒకరు సినీ స్టార్ అల్లు అర్జున్ మరొకరు సీఎం రేవంత్ రెడ్డి అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సంధ్య థియేటర్, మెదక్‌లో ఒక రోడ్డు.. రెండు కూడా ప్రజల కోసం ఉద్దేశించినవే అని పేర్కొన్నారు. సంధ్య థియేటర్‌లో అల్లు అర్జున్‌తో పుష్ప 2 సినిమా చూడాలని దివంగత రేవతి తన కొడుకుతో బెనిఫిట్ షో కు వచ్చింది. బెనిఫిట్ షోకు పర్మిషన్ సీఎం /కోమటి రెడ్డి ఇచ్చారని చెప్పారు. మరోచోట సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నాడని బహిరంగ ప్రదేశంలో ఇద్దరు యువకులు ఫ్లెక్సీ కడుతున్నారని.. వారికి పర్మిషన్ లేదని అన్నారు. విద్యుత్ షాక్ వల్ల ప్రమాదవశాత్తూ చనిపోయారని చెప్పారు. ఈ రెండు సంఘటనల్లో కథానాయకులకు వ్యక్తులను చంపాలన్న ఉద్దేశం ఉండి ఉండదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సెక్షన్ 105 అంటే జాగ్రత్తలు తీసుకోనందు వల్ల జరిగిన మరణం.. ఉద్దేశపూర్వకంగా చేసిన హత్య కాదు అని పేర్కొన్నారు. కింద ను ఈ కేసులో ఏ11గా పెట్టినట్టు తెలుస్తోంది. గా అయితే ఇది ముమ్మాటికీ స్థానిక పోలీసు వైఫల్యమే అని పేర్కొన్నారు. కానీ పోలీసులు తమకు తామే నిందితులుగా లో పేర్లు చేర్చుకుంటారా? అని ప్రశ్నించారు. ఇదే సూత్రం ప్రకారం మెదక్ ఘటనలో కూడా స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు, చివరికి సీఎం రేవంత్ రెడ్డికూడా నిందితులవుతారని పేర్కొన్నారు.

# ఒసాము సుజుకీ మరణంపై కేటీఆర్ దిగ్భ్రాంతి



హైదరాబాద్ నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్27

ప్రముఖ వ్యాపారవేత్త, దిగ్గజ వాహన తయారీ సంస్థ సుజుకి మోటార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒసాము సుజుకి మరణంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒసాము మరణవార్త తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. కొన్నేండ్ల క్రితం హమమత్సులో ఒసాము సుజుకీని కలుసుకునే, ఆయనతో ముచ్చటించే అదృష్టం దక్కిందని చెప్పారు. ఒసాము చెప్పిన మాటలు, ఆయన వినమ్రత ఎప్పటికీ తన మనసులో గుర్తుండిపోతాయని తెలిపారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒసాము సుజుకి తుది శ్వాస విడిచినట్లు సుజుకి మోటార్ కార్పొరేషన్ కంపెనీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. లింఫోమా బ్లడ్ క్యాన్సర్‌తో మరణించినట్లు తెలిపింది. 1930 జనవరి 30న జపాన్‌లోని గెరోలో ఒసాము జన్మించారు. 1958లో షోహో సుజుకీని ఆయన వివాహం చేసుకున్నారు. సుజుకీ కుటుంబానికి వారసులు లేకపోవడంతో వివాహం అనం తరం ఆ కంపెనీ పగ్గాలు చేపట్టారు. ఆ కంపెనీకి చెందిన బైక్‌లు, కార్లను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. దాదాపు 40 సంవత్సరాలకు పైగా సుజుకి మోటార్ కార్ప్‌కు నాయకత్వం వహించారు. 2021 సంవత్సరంలో ఆయన పదవీ విరమణ ప్రకటించారు. డిసెంబర్ 25న ఆయన క్యాన్సర్‌తో మరణించినట్లు కంపెనీ ఇవాళ ప్రకటించింది.



## తెలంగాణ టెట్ అభ్యర్థులకు అలర్ట్.. 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్..!

హైదరాబాద్ నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్27

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కు సంబంధించిన హాల్ టికెట్లను టీజీ టెట్ కన్వీనర్ శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. టెట్ రాతపరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ %-% 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

**అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు ఇవే..**

-ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించనున్నారు.

-ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు.

-అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డు(ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ) తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

# వీరమల్లులో పాటపాడిన పవన్



టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ ఏదైనా అప్‌డేట్ అందిస్తారేమోనని చూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్‌ను జనవరి 1న మధ్యాహ్నం 12 గంటలకు లాంచ్ చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ పాటను పవన్ కల్యాణ్ పాడటం విశేషం. తెలుగుతోపాటు మిగిలిన భాషల్లో కూడా పవన్ కల్యాణ్ వాయిస్‌తో పాట ఉండబోతుందట. ఇప్పటికే పవన్ కల్యాణ్ పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలువడమే కాదు.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. మరి పీరియాడిక్ డ్రామాకు స్టార్ యాక్టర్ వాయిస్ ఎలాంటి బజ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించినట్టు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.



# మనం ఏదైనా చేయగలం : సమంత

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిం దీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్ సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.

# అల్లుఅర్జున్ బెయిల్ పిటిషన్ వాయిదా



సంధ్య థియేటర్ ఘటనలో టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ విచారణకు అల్లు అర్జున్ వర్చువల్‌గా హాజరయ్యాడు. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేసేందుకు పీపీ కోర్టును సమయం కోరారు. ఈ కేసులో తదుపరి విచారణను కోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. గతంలో విధించిన 14 రోజుల రిమాండ్ నేటితో ముగియనుంది. అయితే ఇదే కేసులో అల్లు అర్జున్‌కు హైకోర్టు ఇప్పటికే మధ్యంతర బెయిల్ ఇచ్చింది. పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొకిసలాట ఘటనపై అరెస్టయిన అల్లు అర్జున్‌కు ఈ నెల 13న హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసిన కోర్టు రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది.

తొక్కిసలాటలో మరణించిన మహిళ భర్త ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టు చేయకుండా బెయిల్ మంజూరు చేయాలంటూ అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ఎదుట సుదీర్ఘ వాదనలు జరిగాయి. అల్లు అర్జున్‌తోపాటు సంధ్య థియేటర్ యజమానులు ఇద్దరికి మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు.

ఇంకా అరెస్ట్ కాని ఇతర నిందితుల్లో నలుగురు సంధ్య థియేటర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులకు ఉత్తర్వులను జారీచేశారు.

# సల్మాన్‌ఖాన్ సికిందర్ టీజర్ వాయిదా

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్‌ను ఇవాళ ఉదయం 11:07 నిమిషాలకు లాంచ్ చేయాల్సి ఉంది. అయితే మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. దేశమంతా సంతాపం ప్రకటిస్తున్న ఈ సమయంలో ఆయన మృతికి సంతాపంగా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నాం. టీజర్‌ను రేపు ఇదే (ఉదయం 11:07) సమయానికి లాంచ్ చేస్తామని అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్.



# మన్మోహన్ పాత్రను రిజెక్ట్ చేయాలనుకున్నా : అనుపమ్‌ఖేర్

మన్మోహన్‌సింగ్ మృతిపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు సంతాపం వ్యక్తంచేశారు. తాజాగా నటుడు అనుపమ్ ఖేర్ కూడా మన్మోహన్ గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించాడు. ఈ క్రమంలోనే మన్మోహన్‌సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'ను బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో మన్మోహన్ పాత్రలో నటించాడు అనుపమ్ ఖేర్. మన్మోహన్ సింగ్ చాలా తెలివైన వ్యక్తి. ఎంతో నిజాయతీపరుడు, గొప్ప నాయకుడు. ఆయనను కలిసే అవకాశం నాకు రెండు సార్లు వచ్చింది. అయితే ఆయన జీవిత ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాలో నేను మన్మోహన్ పాత్రలో నటించాను. మొదట ఈ సినిమా కోసం చిత్రబృందం నన్ను సంప్రదించినప్పుడు నేను ఒప్పుకోలేదు. నా పర్సనల్ కారణాలతో పాటు రాజకీయ ఒత్తిడులకు తలవంచి ఈ ప్రాజెక్ట్‌ను వదిలేద్దమనుకున్నాను. కానీ ఒక గొప్ప వ్యక్తి జీవిత చరిత్రలో నటించే అవకాశం అందరికి రాదని ఈ సినిమాను అంగీకరించాను. నేను చేసిన గొప్ప సినిమాల్లో ఇదోకటి. ఆ చిత్రం వివాదాస్పదం అయ్యి ఉండవచ్చు.. కానీ ఆయన మాత్రం వివాదాలు లేనివాడు అంటూ అనుపమ్ చెప్పుకోచ్చాడు. అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఈ సినిమాకు విజయ్ గుట్టే దర్శకత్వం వహించగా.. సంజయ్ బారు రచించిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్: ది మేకింగ్ అండ్ అన్ మేకింగ్ ఆఫ్ మన్మోహన్ సింగ్' అనే నవళ ఆధారంగా ఈ సినిమా వచ్చింది. 2019లో విడుదలైన ఈ చిత్రం తీవ్ర విమర్శలను ఎదుర్కోంది. మన్మోహన్ సింగ్ కూడా ఈ సినిమాపై స్పందిస్తూ.. ఇందులో చెప్పినవన్ని అబద్దాలు అంటు చెప్పుకోచ్చాడు.



# మహిళలెవరూ సీఎం సమావేశానికి హాజరుకానవసరం లేదు : పూనమ్‌కౌర్

ఇండస్ట్రీలో ఉన్న సమస్యలపైనే కాకుండా సామాజిక అంశాలపై ఎప్పటికపుడు గొంతు వినిపించే నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది పూనమ్ కౌర్. సోషల్ మీడియాలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని తెలిసిందే. ఈ భామ ఎప్పుడు ఏదో ఒక కామెంట్ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మహిళలెవరూ సీఎం సమావేశానికి వెళ్లేంత ముఖ్యమేం కాదంటోంది పూనమ్ కౌర్. ఈ మేరకు పూనమ్ కౌర్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. సీఎంతో సమావేశానికి మహిళలెవరూ కూడా ముఖ్యమైన వ్యక్తులుగా పరిగణించబడలేదు. ఎందుకంటే మహిళలకు ఎలాంటి సమస్యలుండవు. వ్యాపార సంబంధ విషయాలు, హీరోకు సమస్యలు వచ్చినప్పుడు మాత్రం



పరిశ్రమ నిలబడుతుంది. కానీ మహిళలెవరికీ సమస్య ఉండదు.. అంటూ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది పూనమ్ కౌర్. ఈ కామెంట్స్ సినీ ప్రముఖులతో భేటిను ఉద్దేశించి చేసినవేనంటూ పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ కామెంట్స్‌పై ఎవరెలా స్పందిస్తారనేది చూడాలి.